బాలగణేశ్ ఉత్సవాలకు 1500 కేజీల భారీ లడ్డూ

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3 : నగరంలో ఇప్పటివరకు ఎప్పుడూ లేనివిధంగా 'వారాహి' ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పాపయ్యపేట చమన్ కాకతీయ థియేటర్ పక్కన బాలగణేశ్ ఉత్సవాలకు 1500 కేజీలతో భారీ లడ్డును 3 రోజులు నియమ నిష్టలతో తయారు చేయించి, గణపతికి నైవేద్యంగా సమర్పిస్తున్నట్లు అధ్యక్షుడు సూర్య దేవర క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజలు పాల్గొని గణపతి దేవుడి భారీ లడ్డును వీక్షించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, కోశాధికారి పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3 : డిగ్రీ విద్యార్థులు ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థులు సమస్యల నివృత్తి కోసం వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ సూచించారు. ఈ నెల 8 వరకు ఐసెట్-24 క్వాలిఫై అయిన విద్యార్థులు సర్టిఫికెట్స్ ధ్రువీకరణ స్లాట్స్ ఎంచుకోవచ్చని, 9 వరకు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికెట్స్ ధ్రువీకరణ జరుగుతుందని తెలిపారు. 11 వరకు ఆప్షన్స్‌ను ఎంచుకొన్న విద్యార్థులకు 14న సీట్ కేటాయించనున్నట్లు తెలిపారు. మంగళవారం 200 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి పాలిటెక్నిక్ కాలేజీకి వచ్చారని ప్రిన్సిపాల్ వివరించారు.

చిరు ఆహార వ్యాపారాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వరంగల్, సెప్టెంబర్ 3 : గ్రేటర్ పరిధిలో చిరు ఆహార వ్యాపారాలు నిర్వహించే వారు ఆహార పరిరక్షణ రిజిస్ట్రేషన్(ఎఫ్ఎస్ఎస్ఏఐ) తప్పనిసరిగా కలిగి ఉండాలని ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని వారి కోసం ఈ నెల 5న కార్పొరేషన్ ఆవరణలోని మెప్మా భవన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆహార వ్యాపారాలు చేసే వారు ఆధార్‌కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో రావాలని ఆయన సూచించారు.

మూడో రోజూ పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

కాజీపేట, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలతో పాటు కేసముద్రం- తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాల కింద కంకర కొట్టుకుపోవడంతో రైల్వే అధికారులు మంగళవారం కూడా కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు పరిచి, మరికొన్నింటిని దారి మళ్లించి నడిపారు. సాయినగర్ షిర్డీ, ఈస్ట్‌కోస్ట్, కృష్ణా, నాగర్‌పోల్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ, బీదర్, చార్మినార్, విశాఖ సూపర్ ఫాస్ట్, మణుగూర్ ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్, కోణార్క్, కాజీపేట- విజయవాడ పుల్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. అలాగే, ఈస్ట్‌కోస్ట్, గోదావరి, పద్మావతి, గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను పెగడిపల్లి, నల్గొండ, గుంటూర్, తెనాలి, విజయవాడల మీదుగా దారి మళ్లించి నడిపించారు. భద్రాచలం రోడ్డు-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే సింగరేణి రైలును సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కాజీపేట వరకు, కుదించి నడిపించారు

ఖమ్మం తరలిన బల్దియా కార్మికులు

వరంగల్, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలతో ఖమ్మం వరద ముంపు ప్రాంతాల్లో బల్దియా కార్మికులు పారిశుధ్య సేవలు అందించేందుకు వెళ్లారు. గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అదేశాలతో మంగళవారం రాత్రి నాలుగు బస్సుల్లో 150 మంది కార్మికులతోపాటు 10 మంది జవాన్లు, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఖమ్మం పంపించినట్లు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ తెలిపారు. ఖమ్మంలో వరద బీభత్సంతో అనేక కాలనీలు మునిగిపోవడం, బురద పేరుకపోవడంతో అక్కడ పారిశుధ్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. అలాగే, 10 స్వచ్ఛ ఆటోలు, 5 ట్రాక్టర్లు, ఒక రోబో కార్ట్ పంపించామని తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, శ్యామ్ రాజ్, సంపత్‌రెడ్డి, జవాన్లు చీకటి ప్రకాశ్, కొత్తకొండ శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఫోర్స్ కంపెనీ కొత్త మోడల్ వాహనం

వరంగల్, సెప్టెంబర్ 3 : ఆటో మొబైల్ రంగంలోని ఫోర్స్ కంపెనీ కొత్త మోడల్ వాహనాన్ని విడుదల చేసింది. ఆర్బా నీయం పేరుతో కొత్త మోడల్ వాహనం లాంచ్ కాగా, మంగళవారం ములుగురోడ్డులోని కె మోటార్స్ షోరూంలో కొనుగోలుదారుడికి వాహనాన్ని అందజేశారు. ఈ వాహనం 9, 10, 12, 13, 16 సీట్ల వేరియంట్లలో లభిస్తుందని షోరూం మేనేజర్ తెలిపారు. వాహనం ప్రారంభ ధర రూ.30,51,197 నుంచి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలుదారుడికి వాహనాన్ని అందిస్తున్న షో రూం ప్రతినిధులు

విద్యార్థులకు అర్థమయ్యే బోధించాలి: డీఈవో

ఐనవోలు, సెప్టెంబర్ 3 : విద్యార్థులకు అర్యమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని డీఈవో వాసంతి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, వెంకటాపురం జడ్పీ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ మేరకు ఆమె ముందుగా తరగతి గదులను సందర్శించి, ఉపాధ్యాయుల బోధన తీరును పర్యవేక్షించారు. ఆమె వెంట జిల్లా జండర్ కోఆర్డినేటర్ సునీత, మండల స్పెషల్ ఆఫీసర్ సునీత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ఎస్‌వో సత్యవాణి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

BUSINESS OFFER

★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

లోతట్టు కాలనీలను వదలని వరద నీరు

- నీటిని మళ్లిస్తున్న సిబ్బంది
- రెండు పునరావాస కేంద్రాల్లో బాధితులు

మార్వాడీ సమాజ్‌లోని పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న బల్దియా సిబ్బంది

లోతట్టు ప్రాంతాల్లో నిలిచి ఉన్న వరద నీరును దారి మళ్లిస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్, సెప్టెంబర్ 3 : నగరాన్ని వర్షం వీడినా లోతట్టు ప్రాంతాలను వరద నీరు వదలడం లేదు. నగరంలోని లోతట్టు కాలనీలు వరద నీటితో నిండిపోయాయి. వర్షాలు, ముసురు నేపథ్యంలో బల్దియా యంత్రాంగం అప్రమత్తమైంది. బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, రౌండ్ ద క్లాక్ పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచి ఉన్న వరద నీటిని మళ్లిస్తున్నారు. ఆరు పునరావాస కేంద్రాలల్లో ముంపు బాధితలకు ఆశ్రయం కల్పించగా, ప్రస్తుతం కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో బాధితులు ఇళ్లలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం రెండు పునరావాస కేంద్రాల్లో బాధితులు ఆశ్రయం పొందుతున్నారు. మంగళవారం వరంగల్ కలెక్టర్ సత్య శారద కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల, పోతన బైపాస్ రోడ్డులోని మార్వాడీ సమాజ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులకు భరోసా కల్పించారు. కాగా, హంటర్‌రోడ్డులోని ఎన్‌టీఆర్‌నగర్, హనుమకొండలోని ఇందిరమ్మ కాలనీ, ఎన్ఆర్ నగర్, బీఆర్ నగర్ కాలనీల్లో వరద నీరు ఇంకా నిలిచి ఉంది. వాటిని దారి మళ్లించే పనుల్లో బల్దియా సిబ్బంది నిమగ్నమయ్యారు. ఎన్‌టీఆర్ కాలనీ వాసులు ఆశ్రయం పొందిన మార్వాడీ సమాజ్ మందిరంతోపాటు బీఆర్ నగర్, రాజీవ్‌కాలనీవాసులు ఆశ్రయం పొందిన కరీమాబాద్ పాఠశాల పునరావాస కేంద్రాల్లో అధికారులు భోజనం, తాగు నీటి సౌకర్యాలు కల్పించారు.

అప్రమత్తంగా యంత్రాంగం

మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. బల్దియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను కొనసాగిస్తున్నారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భట్టుపల్లి, ఉర్సు చెరువులు మత్తడి పోస్తుండడంతో ఆయా చెరువుల నీరు వచ్చి ఎన్‌టీఆర్ నగర్ కాలనీలలోకి చేరుతోంది.

తగ్గుముఖం పట్టిన వర్షం

జిల్లా సరాసరి వర్షపాతం 37.1మిల్లీమీటర్లు

హనుమకొండ, సెప్టెంబర్ 3: రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు తగ్గుముఖం పట్టాయి. హనుమకొండ జిల్లాలో మంగళవారం వరకు 8.9 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా ఎల్కతుర్తి మండలంలో 19.3మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా కాజీపేట మండలంలో 2.0 వర్షపాతం నమోదైంది. అలాగే, భీమదేవరపల్లిలో 15.5, వేలేరులో 12.3, కమలాపుర్‌లో 10.2, హసన్‌పర్తిలో 13.8, ధర్మసాగర్‌లో 9.4, హనుమకొండలో 7.6, ఐనవోలులో 3.8, పరకాలలో 2.5, దామెరలో 10.5, ఆత్మకూర్‌లో 5.6, శాయంపేటలో 6.2, నడికూడలో 5.5మి.మీ వర్షపాతం నమోదైంది.

మిర్చి రైతుకు కన్నీరు

శాయంపేట : పూర్తిగా దెబ్బతిన్న మిర్చి తోట

శాయంపేట : భారీ వర్షాలు రైతులను నిండా ముంచాయి. మండల పరిధిలోని గంగిరేణి గూడెం, సూర్యనాయక్ తండా, నూర్జహాన్‌పల్లి, ప్రగతి సింగారం, గట్ల కనపర్తి, పెద్దకోడపాక, కొప్పుల తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. గంగిరేణి గూడెం, వాగవతలి గ్రామాల్లో మిర్చి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 20 రోజుల క్రితమే మిర్చి మొక్కలను పెట్టినట్లు రైతులు తెలిపారు. పెద్ద సంఖ్యలో తోటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి మొక్కలు కూడా పూర్తిగా వరదకు కొట్టుకుపోయాని లబోదిబోమంటున్నారు. పత్తి చేలల్లో నీళ్లు నిలిచి, జాలు పడడంతో గడ్డి పెరిగి పత్తి దెబ్బతిందని రైతులు తెలిపారు. భారీ వర్షాలు తమను ముంచాయని ఆందోళన వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించరూ..

ఐనవోలు : భారీ వర్షానికి మండలవ్యాప్తంగా పంట నీళ్ల పాలైంది. మక్కజొన్న పంట నేలకొరిగింది. పత్తి పంటలో పూత రాలింది. వరి పంట నీట ముపిగింది. మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పరిశీలన చేసి నష్టం అంచనా వేసి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాలుగు రోజులుగా తాగునీరు బంద్

శాయంపేట, సెప్టెంబర్ 3 : మిషన్ భగీరథ ద్వారా నాలుగు రోజులుగా శాయంపేట మండల వ్యాప్తంగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జోగంపల్లి క్యాంపు ఓహెచ్ బీఆర్ నుంచి పైపులైన్ ద్వారా 24 గ్రామపంచాయతీలకు భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే, జోగంపల్లి క్యాంపులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సరఫరా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో తాగునీటి కోసం నాలుగు రోజులుగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. శాయంపేట గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఆరేపల్లి సమీపంలోని గుట్ట పైకి ఎక్కించే మోటరు కూడా కాలిపోయిందని పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ తెలిపారు. కొత్త మోటర్ తెప్పిస్తే బిగిస్తామని చెప్పారు. తరచూ నీటి సరఫరా నిలిచిపోతుందని, అధికారులు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై భగీరథ డీఈ శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

వరద బాధితులకు ఒక రోజు మూల వేతనం

హనుమకొండ, సెప్టెంబర్ 3 : వరద బాధితులకు తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఒక రోజు మూలవేతనం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని టీఎన్జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో వర్షాల వల్ల ఎంతోమంది ప్రజలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ మేరకు ఒక రోజు మూలవేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి సెప్టెంబర్ నెల వేతనంలో మినహాయించుకోవాలని సీఎంను జేఏసీ కోరడంపై హర్షం వ్యక్తం చేశారు.

రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలి

కాజీపేట, సెప్టెంబర్ 3 : తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ఎన్నికల ముందు ఇచ్చిన రుణమాఫీ హామీని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని సీపీఎం నాయకుడు జంపాల రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాజీపేట తహసీల్దార్ భావ్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జంపాల రమేశ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది రైతులకు రుణమాఫీ అందలేదనన్నారు. బ్యాంకు అధికారులు రైతులను ఇబ్బందులపాలు చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రుణమాఫీ అయిన రైతులకు తిరిగి పంట రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, మదన్‌చారి, భాస్కర్ పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించాలి

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 3 : వర్షాకాలం సీజన్‌లో అన్ని గ్రామాల్లో శానిటేషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో విద్యాలత సూచించారు. మంగళవారం మండలంలోని ఇందిరానగర్, గోపాల్‌పూర్, ఎల్కతుర్తి తదితర గ్రామాలను సందర్శించి శానిటేషన్ పనులను పరిశీలించారు. అలాగే, ఇటీవల వర్షాలకు ఇందిరానగర్ గ్రామంలో నేలకూలిన ఇండ్లను పరశీలించారు. గోపాల్‌పూర్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో సమావేశమై డ్రైడే, ఫీవర్ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో రవి బాబు, పీఆర్ ఏఈ ఉమా మహేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్, ఎంపీడీవో, ఏపీవోను సన్మానిస్తున్న మహిళలు

ఫీల్డ్ అసిస్టెంట్ సేవలు భేష్

శాయంపేట, సెప్టెంబర్ 3: కొత్తగట్టు సింగారంలో కూలీలకు ఉపాధి హామీ పనుల్లో అధిక పని దినాలు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజమల్లు సేవలు భేష్ అని అధికారులు కొనియాడారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఎంపీడీవో ఫణిచంద్ర, ఏపీవో అనిత, పరిశీలకుడు నిశాంత్ హాజరయ్యారు. ఈ ఏడాది అత్యధిక పని దినాలు కల్పించిన రాజమల్లును సన్మానించారు.

జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3: ఈ నెల 27, 28వ తేదీల్లో పింగళి మహిళా కాలేజీలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెండురోజుల 'సొసైటీ, ఎకానమీ అండ్ కల్చర్ ఇన్ తెలంగాణ 12 టు 20వ సెంచరీ సీఈ' జాతీయ సదస్సు పోస్టర్లు విశ్వవిద్యాలయ చరిత్ర విభాగంలో సోషల్ సైన్సెస్ విభాగాల డీన్ ప్రొఫెసర్ టి.మనోహర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, విశ్రాంత ఆచార్యులు కే.విజయబాబు, తెలుగు యూనివర్సిటీ డీన్ ఆచార్య గడ్డం వెంకన్న, జాతీయ సదస్సు కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆర్‌బీఐ 90 క్విజ్' పోస్టర్లు..

హనుమకొండచౌరస్తా, సెప్టెంబర్ 3: రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి 'ఆర్‌బీఐ 90 క్విజ్' పోస్టర్లను కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. అర్హత, ఆసక్తిగల విద్యార్థులు క్యుఆర్ కోడ్ ద్వారా ఇద్దరు టీంగా పేర్లు నమోదు చేసుకోవాలని వరంగల్ ఆర్‌బీఐ ఆఫీసర్ మహ్మద్ అలీబాబా కోరారు. వివరాలకు www.rbi.org.inలో సంప్రదించాలని సూచించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

హసన్‌పర్తి, సెప్టెంబర్ 3 : హత్యాయత్నం కేసులో నిందుతుడిని హసన్‌పర్తి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన బల్సుకూరి వినయ్(రిచ్) 2023లో డిసెంబర్‌లో ఇదే గ్రామానికి చెందిన జల్లి అక్షయ్‌కుమార్‌కు ఫోన్ చేసి రోడ్డుకు రమ్మని పిలిచి వైన్ షాపు వద్దకు తీసుకువెళ్లాడు. అతడిని బీర్లు తాగమని బలవంతం చేయగా నిరాకరించిన అక్షయ్‌కుమార్‌ను ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. అంతే కాకుండా సమీపంలోని చికెన్‌సెంటర్‌లోని కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. అడ్డుకున్న తుమ్మ లక్ష్మణ్, అతడి భార్యలక్ష్మిని, చికెన్ సెంటర్‌యజమాని అమీరోద్దిన్‌ను సైతం గాయపరిచాడు. దీంతో వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బల్సుకూరి వినయ్‌పై హత్యయత్నం కేసు నమోదు నమోదు చేశారు. అప్పటి నుంచి వినయ్ పరారీలో ఉండగా మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

'దీన్‌దయాళ్'స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, సెప్టెంబర్ 03 : దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో పోస్టల్ స్టాంప్‌ల సేకరణ, అధ్యయనం పెంచే లక్ష్యంతో చేస్తున్న ప్రయత్నాలను బలోపేతం చేసేందుకుగాను పోస్టల్ శాఖ ఈ స్కాలర్‌షిప్ పథకం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి అవార్డు గ్రహితకు మూడు నెలలకు రూ. 1500 చొప్పున ఏడాదికి రూ. 6వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రతి తరగతిలో 10 మంది విద్యార్థులకు అందజేస్తారని తెలిపారు. మార్గదర్శకాలు, దరఖాస్తు ఫారం www.indiapost.gov.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 13లోగా హనుమకొండ అదాలత్ సెంటర్, హనుమకొండ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

నిట్‌లో ఆన్‌లైన్ ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3: నిట్‌లో 'ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం'పై నెల రోజులపాటు నిర్వహించనున్న ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. యూజీసీ స్పాన్సర్ చేసిన శిక్షణను అక్టోబర్ 3 వరకు ఎంఎంటీటీసీ వరంగల్ నిట్ ద్వారా నిర్వహిస్తున్నారు. చండీగఢ్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ శిక్షణలో ఉన్నత విద్య, కరికులం డిజైన్, టీచింగ్, లెర్నింగ్ అసెస్‌మెంట్, రీసెర్చ్, అకాడమిక్ లీడర్‌షిప్ తదితర పది మాడ్యూల్స్ ఉంటాయని, 161 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొంటున్నారని చెప్పారు.

అవయవదానంతో పునర్జన్మ

వరంగల్, సెప్టెంబర్ 3 : అవయవదానం ద్వారా పునర్జన్మ అవకాశం లభిస్తుందని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఏవీవీ జూనియర్ కళాశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ భుజంగ రెడ్డి, కోడిమాల శ్రీనివాసరావు, జాతీయ అవార్డు గ్రహీత మండల పరుశరాములు, జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, అధ్యాపకులు అనిత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా శంకరయ్య

శంకరయ్యకు నియామక పత్రం ఇస్తున్న రిజిస్ట్రార్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3: కేయూ తెలుగు విభాగానికి చెందిన అధ్యాపకుడు మంథని శంకరయ్యను అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా నియమించారు. 2006లో పీజీ పూర్తి చేసుకుని, 2010లో బన్న ఐలయ్య పర్యవేక్షణలో 'శిఖామణి కవిత్వం-సమగ్ర పరిశీలన' అంశంపై పరిశోధన పూర్తి చేసి, పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 2008 నుంచి 2013 వరకు ఆర్ట్స్ కాలేజీ యూజీ అధ్యాపకుడిగా 2013 నుంచి పీజీ అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. ఆయనను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ వీ రామచంద్రం, ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పరిశోధకులు అభినందించారు.

పంట పొలంలో ఒంటరి వృద్ధురాలు

- జ్వరం బారిన పడి విషమించిన ఆరోగ్యం
- స్థానిక రైతులు గుర్తించి 108కు సమాచారం
- ఎంజీఎం దవాఖానకు తరలించిన సిబ్బంది

వృద్ధురాలిని దవాఖానకు తరలిస్తున్న 108 సిబ్బంది

కాజీపేట, సెప్టెంబర్ 3 : సోమిడి శివారులోని పంట పొలంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108 సిబ్బంది ఆమె ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. 108 ఈఎంటీ చైతన్య, పైలట్ వెంకటేశ్ కథనం ప్రకారం.. సోమిడికి చెందిన ఓరుగంటి లక్ష్మి భర్త నారాయణరెడ్డి ఐదేళ్ల క్రితం మరణించాడు. కుటుంబ సభ్యుల సహకారంతో సోమిడి శివారులోని పంట పొలంలో ఇల్లు నిర్మించుకుని ఒక్కతే ఉంటున్నది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఆమె బయటకు రాలేదు. వాతావరణం చలిగా ఉండడంతో పాటు ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఇంట్లో మంచానికే పరిమితమైంది. లక్ష్మి బయట కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన పక్క రైతులు పోలీసులకు సమాచారం అందించి తలుపులు తెరిచి చూశారు. అప్పటికే ఆమె స్పృహ తప్పి పడిపోయి ఉండడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది వృద్ధురాలిని పరీక్షించి బీపీ పెరగడం, జ్